## ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- సంబంధిత అధికారులతో మీటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 27 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3 నుంచి 22వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, అదేవిధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. వృత్తి విద్య మొదటి ఏడాదిలో 797 మంది, రెండో ఏడాదిలో 1,336 మంది.. అదేవిధంగా ఇంటర్ రెండో ఏడాదిలో 3,782 మంది జనరల్‌కు సంబంధించిన విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతి లేదని.. కేంద్రాల వద్ద అత్యవసర మందులతోపాటు ఏఎన్ఎం, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడుపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్, డీఈసీ నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ సురేశ్, డీఎంహెచ్‌వో, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


### ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆసరా పెన్షన్, భూసమస్యలు, ఇతర సమస్యలపై 110 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పెం డింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించిన కేటీఆర్


కులకచర్ల మండలంలోని దాస్యనాయక్‌తండాలో వచ్చే నెల 1న నిర్వహించనున్న అం బేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఫిబ్రవరి ఒకటిన ఉదయం 11.30 గంటలకు అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ మంత్రి ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజిని, మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మందిపల్ వెంకట్, బీఆర్ఎస్ నాయకులు రాజశేఖర్, నర్సింహులు, జుబేర్, విక్కీనాయక్ తదితరులు పాల్గొన్నారు. -పరిగి/కులకచర్ల, జనవరి 27



## హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిశారు. సోమవారం దాసర్లపల్లి గ్రామంలో కోటి దీపోత్సవం, రుద్ర సహిత శత చండీయాగంలో పాల్గొన్న హరీశ్‌రావుతోపాటు మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌లను బీఆర్ఎస్ నాయకులు కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, గోపాల్ పాల్గొన్నారు -కడ్తాల్, జనవరి 27

## అమ్మలగన్న అమ్మ.. సల్లంగా చూడమ్మ..



### రుద్రారంలో ఘనంగా బోనాల పండుగ

మండలంలోని రుద్రారంలో గ్రామ దేవతకు సోమవారం మహిళలు ఘనంగా బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలను తమ తలలపై పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికెళ్లి ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. పిల్లాపాపలను సల్లంగా చూడాలని.. పాడి పంటలు సమృద్ధిగా పండి గ్రామంలోని అందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, యువ నాయకుడు మహిపాల్‌రెడ్డి, గ్రామ యువకులు , మహిళలు, బంధువులు పాల్గొన్నారు. -పెద్దేముల్, జనవరి 27

## ప్రత్యేక అధికారిగా ప్రతిమాసింగ్ బాధ్యతల స్వీకారం



రాష్ట్రంలో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. జిల్లాలోని 12 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట, షాద్‌నగర్, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలకు, మీర్‌పేట కార్పొరేషన్‌కు అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) ప్రతిమాసింగ్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె బాధ్యతలు చేపట్టారు. తుర్కయాంజాల్, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం కమిషనర్లు అమరేందర్‌రెడ్డి, బాలకృష్ణ, రవీందర్‌తోపాటు మరికొంత మంది అధికారులు అదనపు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. - ఆదిబట్ల, జనవరి 27

## ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

### రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

యాచారం, జనవరి 27 : ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన యాచారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి.. పలు రికార్డులను పరిశీలించారు. మండలంలో నెలకొన్న స్థితిగతులను ఎంపీడీవో నరేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పీ సీఈవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరుపై ప్రధాన దృష్టి సారించాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించాలని, సంక్షేమ పథకాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఆత్మీయ సమ్మేళనం

1993-94లో కందుకూరు మండలం, మీర్‌ఖాన్‌పేట్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం రావిర్యాల సమీపంలోని ఓ రిసార్ట్‌లో ఘనంగా జరిగింది. విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, రాజు, లక్ష్మీనారాయణ, రాము, వెంకట్‌రెడ్డి, రాధాకృష్ణలను ఘనంగా సన్మానించారు.
-రంగారెడ్డి, జనవరి 27 (నమస్తే తెలంగాణ)

## హాస్టల్ విద్యార్థినుల భద్రతపై ప్రత్యేక నిఘా

- మంగల్‌పల్లి ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు
- విద్యార్థినులకు డయల్ 100, షీటీమ్స్ వినియోగంపై అవగాహన



విద్యార్థినులకు షీటీమ్స్, డయల్ 100పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రాజు

రంగారెడ్డి, జనవరి 27 (నమస్తే తెలంగాణ)/ ఇబ్రహీంపట్నం రూరల్ : జిల్లా శివారు ప్రాంతాల్లోని హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థినుల భద్రతపై పోలీసులు దృష్టి సారించారు. ఇటీవల అమ్మాయిలు ఉండే హాస్టళ్ల వద్ద పోకిరీల ఆగడాలు అధికమయ్యాయి. తాజాగా.. ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని మంగల్‌పల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ఓ బాలికల హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను పోలీసుశాఖ సీరియస్‌గా తీసుకున్నది. విద్యార్థినులు ఉంటున్న హాస్టళ్ల వద్ద నిఘాను పెంచింది. హాస్టళ్లలో ఉండే విద్యార్థినులు డయల్ 100, షీటీమ్స్‌ను వినియోగించుకోవాలని పోలీసుశాఖ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నది.

ముఖ్యంగా ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కళాశాలలు అధికంగా ఉన్నందున, హాస్టళ్లు కూడా అదేస్థాయిలో పెరిగిపోతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ మధు, ఎస్ఐలు రామకృష్ణ, శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.

### విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి : ఏసీపీ రాజు

విద్యార్థినులు డయల్ 100, షీటీమ్స్‌లను సద్వినియోగం చేసుకోవాలి. ఎవరైనా ర్యాగింగ్, టీజింగ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలి. విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ఉండాలి. నేరం జరిగినప్పుడు భయపడకుండా డయల్ 100, 1930, 8712662111కు ఫోన్ చేసి చెప్పాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి. క్రమశిక్షణతో ఉండేలా శ్రద్ధ తీసుకోవాలి. సోషల్ మీడియా వాడేటప్పుడు విద్యార్థినులు చాలా అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దు.

### నగరానికి చేరువలో

# ప్రపంచ స్థాయి పార్కు

- 150 ఎకరాల్లో ఏర్పాటైన ఎక్స్‌పీరియం గార్డెన్
- 85 దేశాల నుంచి వివిధ రకాల మొక్కలు, వృక్షాలు దిగుమతి
- నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం



ఎక్స్‌పీరియం గార్డెన్‌లోని వివిధ రకాల చెట్లు, పూల మొక్కలు



మొయినాబాద్, జనవరి 27 : పర్యావరణ హితమై.. పర్యాటక క్షేత్రమై ప్రపంచస్థాయిలో అనేక ప్రత్యేకతలు సొంతం చేసుకుని భవిష్యత్తులో దేశానికి, రాష్ట్రానికి అనేక రికార్డులు, పురస్కారాలు తీసుకురానున్న గొప్ప ప్రాజెక్టు ఎక్స్‌పీరియం గార్డెన్ అని చెప్పొచ్చు. వందల ఏండ్ల వయసున్న చెట్లతోపాటు వివిధ రకాల పూల జాతుల మొక్కలు ఇక్కడ కనిపిస్తాయి. ఈ పార్కును 150 ఎకరాల విస్తీర్ణంలో రూ. 450 కోట్లతో హైదరాబాద్ మహానగరానికి ఆనుకుని ఉన్న పొద్దుటూరు గ్రామంలో వరంగల్ జిల్లాకు చెందిన రామ్‌దేవ్‌రావు అనే పర్యావరణ ప్రేమికుడు ఏర్పాటు చేశారు. తన తండ్రి స్ఫూర్తితో 25 ఏండ్ల నాటి కలను మంగళవారం సాకారం చేసుకోబోతున్నారు.

భావితరాలకు ప్రకృతిని, పర్యావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఎక్స్‌పీరియం గార్డెన్‌ను ఆయన ఏర్పాటు చేశారు. ప్రపంచంలోని 175 దేశాల్లో పర్యటించి 85 దేశాల నుంచి వివిధ రకాల జాతుల మొక్కలు, చెట్లను తీసుకొచ్చి గార్డెన్‌లో నాటారు. రామ్‌దేవ్‌రావు తన 25 ఏండ్ల నాటి కలను సాకారం చేసుకునేందుకు 12 ఏండ్ల కిందట యూనిక్ ట్రీస్ అనే కంపెనీని స్థాపించారు. దాని ద్వారా ప్రపంచ స్థాయి గార్డెన్‌ను ఆవిష్కరించాలని సంకల్పించి ఎక్స్‌పీరియం అనే గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. దేశానికే తలమానికంగా మారనున్న భూతాల స్వర్గాన్ని నేడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

### 150 ఎకరాలు.. 25 వేల జాతుల మొక్కలు

ఎక్స్‌పీరియం గార్డెన్‌లోని 150 ఎకరాల్లో 25 వేల జాతుల మొక్కలు, వృక్షాలను 85 దేశాల నుంచి సేకరించి నాటారు. అందులో రూ. లక్ష నుంచి రూ. 3.5 కోట్ల విలువైన అరుదైన, ప్రాచీన మొక్కలు, వృక్షాలు ఎన్నో ఉన్నాయి. అదే విధంగా రూ. 5లక్షల నుంచి రూ .కోటి విలువైన శిల్పాలను గార్డెన్‌లో ప్రదర్శించారు. రూ. 50 కోట్లతో 150 ఎకరాలు వికసించేలా గ్లో గార్డెన్‌ను తయారు చేశారు. మొక్కలు, శిల్పాలతోపాటు ఇండియాలో ఎక్కడా లేని విధంగా అత్యధిక అడ్వెంచర్ గేమ్స్ ఉన్న గార్డెన్‌గా దీనిని రూపొందించారు. గార్డెన్‌లో మరో ప్రత్యేకత ఏమిటంటే 1500 మంది సామ ర్థ్యం గల లార్జెస్ట్ హంపి థియేటర్‌ను నిర్మించారు. దేశంలో ఇప్పటివరకూ ఎక్కడా లేని విధంగా గార్డెన్‌లో ఆక్వేరియం రెస్టారెంట్, స్నో పార్కు, అతి పొడవైన బాక్స్ క్రికెట్‌ను ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో 12 ఎకరాల విస్తీర్ణంలో రూ. 50 కోట్లతో మ్యాన్ మే డ్ బీచ్‌ను ఏర్పాటు చేయాలని రామ్‌దేవ్‌రావు సంకల్పించారు.



ఆకట్టుకుంటున్న గార్డెన్‌లోని అందాలు

### ఐదు వేల ఏండ్ల కిందటి చెట్టు కింద బుద్ధ విగ్రహం

గార్డెన్‌లో ఫైకస్ జాతికి చెందిన ఐదు వేల ఏండ్ల కిందటి చెట్టును ఏర్పాటు చేశారు. దాని కింద గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందినట్లుగా రూ పొందించారు. చెట్టు ప్రధాన వేరు భాగానికి రంధ్రం చేసి బుద్ధుడు తప స్సు చేస్తున్నట్లుగా తయారు చేశారు. చెట్టు అందరినీ ఆకట్టుకునేలా కమ లం పువ్వులా డిజైన్ చేశారు. కుర్చీలు, బల్లాల మాదిరిగా చెట్లను ఏర్పాటు చేశారు. 2008లో జరిగిన ఒలింపిక్స్ గేమ్స్‌లో వేలం పాట వేసిన ఒక అరుదైన చెట్టును రూ. 80 లక్షలకు వేలం వేయగా రామ్‌దేవ్‌రావు కొనుగోలు చేశారు. దానికి గార్డెన్‌లో అందంగా ఒలింపిక్ సింబల్ మాదిరిగా ఏర్పాటు చేశారు.







కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఊరెళ్ల గ్రామస్తులు

## మా గ్రామాన్ని మున్సిపాలిటీలో కలుపొద్దు

### కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించిన ఊరెళ్ల గ్రామస్తులు

చేవెళ్ల రూరల్, జనవరి 27 : మండలంలోని ఊరెళ్ల గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దని ఆ గ్రామస్తులు సోమవారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ఊరెళ్ల గ్రామంలో 300 మంది ఉపాధి హామీ పనులకు వెళ్తారని, మున్సిపల్‌లో గ్రామం విలీనమైతే ఉపాధి హామీ పథకం గ్రామంలో రద్దవుతుందని, అన్ని విధాలా నష్టం జరుగుతుందన్నారు. పల్లెలకు వచ్చే ప్రత్యేక నిధులు కూడా ఆగిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి, వ్యాపార పన్నులు విపరీతంగా పెరిగిపోతాయన్నారు. అదేవిధంగా ఊరెళ్ల గ్రామం చేవెళ్ల రెవెన్యూకు చాలా దూరంగా ఉందని, చేవెళ్లకు అత్యంత సమీపంలో ఉండి, రెవెన్యూ కలిసి ఉన్న మల్లారెడ్డిగూడ, కందవాడ, పల్గుట్ట, పామెన గ్రామాలను వదిలి మా గ్రామాన్ని మున్సిపల్‌లో కలపడం సహేతుకంగా లేదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మహ్మద్ ఆసిఫ్, నర్సింహులు, బందయ్య, విఠలయ్య, పెంటయ్య, జహంగీర్, నవీన్, యాదగిరి, శివకుమార్, ప్రవీణ్, మోయిస్, సంజీవయ్య, సత్తయ్య తదితరులు ఉన్నారు.

### పథకాల వివరాలు నమోదు చేయాలి

ఆదిబట్ల : సంక్షేమ పథకాల వివరాలను గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని వార్డుల వారీగా నమోదు చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న ఇంటర్, పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులు అత్యధికంగా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఇంటర్, టెన్త్ పరీక్షల్లో జిల్లా మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాన్నారు.

### ప్రజావాణికి 67 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి 87 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ప్రజలు ప్రజావాణిలో నేరుగా కలెక్టర్‌కే తమ ఫిర్యాదులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖకు 51, ఇతర శాఖలకు 16 మొత్తంగా 87 దరఖాస్తులు వచ్చాయని వారు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా డీఆర్వో సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.